# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు కాశ్మీర్‌లోని సోన్ మార్గ్ సొరంగ మార్గాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
- ❖ జమ్మూ కాశ్మీర్ ఇప్పుడు పర్యాటకం వైపు దృష్టి సారిస్తోందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.
- ❖ మహాకుంభమేళా ఈరోజు ప్రయాగ్‌రాజ్‌లో పౌష్ పూర్ణిమ అమృత స్నానంతో ప్రారంభమైంది.
- ❖ దేశ జనాభాలో 45 శాతం మంది ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పరిధిలోకి వస్తున్నారని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జెపి నడ్డా వెల్లడించారు.
- ❖ ఖో ఖో ప్రపంచ కప్ 2025 ఈరోజు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో కొద్ది సేపటి క్రితం ప్రారంభమయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు కాశ్మీర్‌లోని గండేర్‌బల్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన “సోన్ మార్గ్ సొరంగ మార్గా”న్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జితేంద్ర సింగ్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, టన్నెల్ ప్రాజెక్ట్ అధికారులు ఈ కార్యకమానికి హాజరయ్యారు. ముందుగా ప్రధానమంత్రి సొరంగ మార్గాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ.. సోన్ మార్గ్ సొరంగం గగంగీర్, సోనామార్గ్ మధ్య ప్రయాణ సమయాన్ని 20 - 25 నిమిషాలకు తగ్గిస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో రహదారుల అనుసందానంతో పాటూ పర్యాటకానికి కూడా సోన్ మార్గ్ సొరంగం దోహదపడుతుందని ప్రధానమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 34 సెకన్లు)

ఈ సొరంగం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించబడిందని ఇదొక ఇంజినీరింగ్ అద్భుతమని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని నితిన్ గడ్కరీ మాట్లాడుతూ...

(వాయిస్ 15 సెకన్లు)

=======================

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక సమావేశం "మహాకుంభ్" ఈరోజు ప్రయాగ్‌రాజ్‌లో పౌష్ పూర్ణిమ నాడు అమృత స్నానంతో ప్రారంభమైంది. భక్తులు, యాత్రికులు, సందర్శకులు గంగా, యమునా, సరస్వతి సంగమ ప్రదేశం అయిన త్రివేణి సంగమంలోని వివిధ ఘాట్లలో పవిత్ర స్నానాలును ఆచరించారు. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరిగే మహా కుంభ్ కు ఇప్పటివరకూ కోటి 50 లక్షల మంది హాజరయ్యారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం సురక్షితంగా చిరస్మరణీయంగా ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం ఏడు అంచెల భద్రతను ఏర్పాటు చేసింది. 10 వేల ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26న మహాశివరాత్రి వరకు కొనసాగుతుంది.

=======================

"మహా కుంభ మేళా" ఆధ్యాత్మిక సమావేశాలకు మాత్రమే కాకుండా ప్రపంచ పర్యాటక రంగానికి కూడా ఒక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... దేశీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పర్యాటక మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. మహాకుంభ్‌లోని కళాగ్రామ్ చేతిపనులు, వంటకాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా భారతదేశం యొక్క ప్రాచీన సంప్రదాయాలను ప్రదర్శించడానికి ఈ కార్యక్రమాలు దోహదపడతాయని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు.

=======================

ఉత్తర సరిహద్దుల్లో పరిస్థితి సున్నితంగానే ఉన్నప్పటికీ స్థిరంగా ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఏదైనా ప్రతికూల పరిస్థితిని ఎదుర్కోవడానికి భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని, సరిహద్దు ప్రాంతాల్లో బలమైన మౌలిక సదుపాయాలను నిర్మించడం భారత సైన్యం ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన భారత సైన్యం వార్షిక పాత్రికేయుల సమావేశంలో జనరల్ ద్వివేది మాట్లాడుతూ... జమ్మూ కాశ్మీర్ ఇప్పుడు ఉగ్రవాదం నుండి పర్యాటకం వైపు పయనిస్తోందని అన్నారు.

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

=======================

దేశంలో ఈరోజు వేరు వేరు పండుగలతో పలు రాష్ట్రాల్లో కోలాహలం నెలకొంది. ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, జమ్మూ, చండీగఢ్‌లలో ఈరోజు లోహ్రీ పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. లోహ్రీ పండుగ శీతాకాలపు దీర్ఘ రాత్రుల ముగింపును సూచిస్తుంది. సూర్యుడు ఉత్తరార్ధగోళానికి తన ప్రయాణాన్ని ప్రారంభించడంతో వేసవి కాలానికి స్వాగతం పలుకుతుంది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగను జరుపుకుంటున్నారు. మూడు రోజుల పాటు జరుపుకునే ఈ పండుగను పొంగల్ అని కూడా పిలుస్తూంటారు. అస్సాంలో మాఘ బిహు పేరిట పంట

పండుగను జరుపుకుంటున్నారు. శీతాకాలపు పంటలను ఆస్వాదించడంతో పాటూ సంవత్సరం పొడవునా శ్రేయస్సు కోసం ప్రార్థించడానికి వివిధ వర్గాల ప్రజలు ఒకచోట చేరి పండుగను జరుపుకుంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఖో ఖో ప్రపంచ కప్-2025 ఈరోజు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో కొద్ది సేపటి క్రితం ప్రారంభమయ్యింది. భారత ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రారంభ ఎడిషన్‌లో భారత్ తరఫున 20 పురుష జట్లు, 19 మహిళా జట్లు పాల్గొంటున్నాయి. భారత ఖో ఖో సమాఖ్య 15 మంది సభ్యులతో కూడిన పురుష, మహిళా జట్లను ప్రకటించింది. ప్రతీక్ వైకర్ నేతృత్వంలోని భారత పురుషుల జట్టు నేపాల్ తో ఆడనున్న తొలి మ్యాచ్‌తో ఈ ప్రపంచకప్ ప్రారంభం కానుంది. భారత మహిళా జట్టుకి ప్రియాంక ఇంగ్లే నాయకత్వం వహిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

"ఆయుష్మాన్ భారత్" ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను అమలు చేసిన 34వ రాష్ట్రంగా ఒడిశా నిలిచింది. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి ఆసుపత్రిలో చేరడానికి సంవత్సరానికి 5 లక్షల రూపాయల ఆరోగ్య బీమా అందించబడుతుంది. ఈ మేరకు జాతీయ ఆరోగ్య సంస్థ, ఒడిశా ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఈరోజు న్యూఢిల్లీలో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ పథకం కింద 8 కోట్లకు పైగా ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో ఉండటం వల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఆసుపత్రిలో చేరడం గణనీయంగా పెరిగిందని తెలిపారు. భారతదేశ జనాభాలో 45 శాతం మంది ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పరిధిలోకి వస్తున్నారని కేంద్రమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో రేపు కూడా తీవ్ర చలి వాతావరణం కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. దేశంలోని ఉత్తర, తూర్పు ఈశాన్య రాష్ట్రాల్లో రాబోయే 2 రోజుల్లో ఉదయం, రాత్రి వేళల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంటుందని వెల్లడించింది. వాయువ్య, మధ్య, పశ్చిమ భారతదేశంలో రానున్న 2 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ క్రమంగా తగ్గే అవకాశం ఉందని IMD తెలియజేసింది. ఇదిలా ఉండగా ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు చుట్టుముట్టడంతో అనేక రైళ్ల రాకపోకలు ప్రభావితమవుతున్నాయి. దృశ్యమానత తక్కువగా ఉండటంతో ఢిల్లీకి వెళ్లే 12 రైళ్లు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 77 వేల 378 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 1,048 పాయింట్ల నష్టంతో 76 వేల 330 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345 పాయింట్ల నష్టంతో 23 వేల 085 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =